క్లుప్తంగా

నేడు పీలేరులో ఎంపీ పర్యటన

పీలేరు రూరల్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం పీలేరు మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ జీనత్ షఫీ తెలిపారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం 8.30 గంటలకు మండలంలోని వేపులబైలు పంచాయతీ అరవవాండ్లపల్లెలో లోకనాథరెడ్డి కర్మక్రియల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం 9 గంటలకు స్థానిక వీఎస్‌ఆర్ కల్యాణమండపంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు హాజరు కావాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, హుమయూన్, కడప గిరిధర్‌రెడ్డి, గడిబాషా, శ్రీనాథరెడ్డి, కాలేషా, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సీఎస్‌ఆర్ నిధులు రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ జీనత్ షఫీ, పంచాయతీరాజ్ డీఈ భాస్కర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని మదనపల్లె మార్గంలో సింహంరెడ్డి కాలనీలో 220 మీటర్ల పొడువుతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రజల అవసరాల మేరకు మరికొన్ని చోట్ల కూడా సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఏపీ టూరిజం కౌన్సిల్ మెంబరు షాకీర్, నాయకులు నాగరాజ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగళ్లులో నేటి నుంచి ఉరుసు

కురబలకోట : మండలంలోని అంగళ్లులో రెండు రోజుల పాటు హజ్రత్ సయ్యదినా షేఖ్ అబ్దుల్ ఖాదర్ జిలాని పీరా నెపీర్‌గొసుల్ అజం దస్తగీర్ వారి ఉరుసు ఉత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం రాత్రి గంధం వేడుకలు జరుగుతాయన్నారు. కడప దర్గా గురువు హజ్రత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరీఫుల్లా మహమ్మద్ ఫాతేహా ఖ్వానీ నిర్వహిస్తారన్నారు. గురువారం రాత్రి ఖవ్వాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కులగణన వేగవంతం చేయండి

తంబళ్లపల్లె : మండలంలో చేపట్టిన కులగణను వేగవంతం చేసి 100 శాతం పూర్తి చేసేందుకు పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయవారి సర్వేపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తంబళ్లపల్లె : జనమిత్ర ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేత, వ్యాపారవేత్త నిమ్మచెట్ల శివారెడ్డి(61) అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని కోసువారిపల్లెకు తీసుకురాగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ భార్గవరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయరెడ్డి , మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, కురబలకోట మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఉమాపతిరెడ్డి, సర్పంచులు ఉన్నారు.

మదనపల్లె వన్ డిపో రీజియన్‌లో మొదటి స్థానం

మదనపల్లె సిటీ : అన్నమయ్య రీజియన్ పరిధిలో మదనపల్లె-1 డిపో కెఎంపిఎల్, ఓఆర్ సాధనలో మొదటి స్థానం నిలిచినట్లు డీఎం మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక డిపో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెలలో కెఎంపిఎల్‌లో 5.45, ఓఆర్ 66 శాతం సాధించినట్లు తెలిపారు. సిబ్బంది సమష్టి కృషితో సాధించినట్లు పేర్కొన్నారు. ఆదాయం పెంచి డిపోకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీఐ గీత, ఎంఎఫ్ రవి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణినికి హెల్పింగ్‌మైండ్స్ సభ్యుల సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ : ఓ గర్భిణీని హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు ఆదుకున్నారు. బి.కొత్తకోటకు చెందిన వెంకటేష్ భార్య గంగ నిండు గర్భిణి. బస్టాండులో భార్యను వదలి వెళ్లిపోవడంతో ఆశా కార్యకర్త మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చేర్పించింది. విషయం తెలుసుకున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. దీంతో పాటు కొత్త దుస్తులు, ఇతర సామాగ్రి, భోజన సదుపాయం కల్పించారు.

టీడీపీ పాలనలో పక్కాగృహాల పేరుతో మోసం

- సొంతింటి కలను రూపాయితో బాబు మోసం
- సీఎం జగన్ ఏమి చేశారో టీడీపీ కార్యకర్తలు ప్రశ్నించుకోవాలి
- బి.కొత్తకోటకు అదనంగా 1,005 ఇంటి పట్టాలు
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



బి.కొత్తకోట : ఇంటిపట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



పెద్దతిప్పసముద్రం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

బి.కొత్తకోట : నిరుపేదల సొంతింటి కలను గత టీడీపీ ప్రభుత్వం నెరవేర్చకుండా లబ్ధిదారుల ఖాతాలకు ఒక రూపాయి చెల్లించి నిండా ముంచేసిందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో పేదలకు ఇంటిస్థలాల పంపిణీ కార్యక్రమ సభ జరిగింది. హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదలకు పక్కా గృహాలు మంజూరైనట్లు ఖాతాలకు ఒక రూపాయి పడింది. ఆ తర్వాత ఇంటి బిల్లులు పడినా లబ్ధిదారులకు చేరలేదు..ఏ ఖాతా ద్వారా ఎవరికి చేరిందో ఇప్పటికి తెలియదు కాని మోసపోయింది మాత్రం పేద లబ్ధిదారులేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి ఈ విషయమై గృహనిర్మాణశాఖ అధికారులు కూడా చెప్పలేకపోతున్నారన్నారు. అర్హత కలిగి ఇల్లులేని పేదలంటూ ఉండకూడదన్న ఆశయంతో ప్రతిఒక్కరికి ఇంటిస్థలం, పక్కా గృహం మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి నవరత్నాలు-పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో 12,522 గృహాలు మంజూరు చేయించగా బి.కొత్తకోట నగర పంచాయతీకి 1,351 గృహాలను కేటాయించామన్నారు. పేదలు తమకు సొంతిల్లు లేదని ఇంటింటి పర్యటనల్లో విన్నవించగా ఇల్లులేని పేదలు ఉండకూడదన్న లక్ష్యంతో ప్రస్తుతం 1,005 ఇంటిపట్టాలు, పక్కా గృహాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఏమి చేశారో టీడీపీ కార్యకర్తలు గుండెలమీద చేయి వేసుకుని ప్రశ్నించుకోవాలన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాలను కోర్టు కేసులను అడ్డుకోవడం టీడీపీ నేతలకు న్యాయమా అని నిలదీశారు. గండికోట ప్రాజెక్టు నుంచి 12 టీఎంసీల నీటిని జిల్లాకు తరలించుకోవాలన్న ప్రణాళికను అడ్డుకున్నారన్నారు. తంబళ్లపల్లెకు పరిశ్రమలు రావాలంటే విద్యుత్, నీరు, రవాణా సౌకర్యాలు మెరుగవ్వాలన్నారు. రహదారులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని, కొత్తగా ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరవగా, పెద్దతిప్పసముద్రం మండలంలో 132 సబ్‌స్టేషన్ మంజూరు కానుందని చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చుట్టపుచూపుగా వచ్చే నాయకులను నమ్మవద్దని కోరారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అనంతరం పేదలకు పండుగ వాతావరణంలో ఇంటిపట్టాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ పుణ్యవతి, కమీషనర్ పీఆర్.మనోహర్, ఎంపీడీఓ నూర్జహాన్, ఎంపీపీ లక్ష్మినరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, వైస్‌ఎంపీపీ ఖాదర్‌వలీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచు మాలిక్, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పీఎస్.తకీవుల్లా, అయూబ్, జాబీర్, పెన్నయ్య పాల్గొన్నారు.

వలంటీర్లే సంక్షేమ వారధులు

పెద్దతిప్పసముద్రం : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు వలంటీర్లే సంక్షేమ వారధులని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వలంటీర్ల సన్మాన సభకు విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం జగనన్న పాలనలో అవినీతి రహిత పాలన అందించడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడం, నిత్యం రాష్ట్ర ప్రజల సంక్షేమానికి పాటుపడే సీఎంను తిట్టడం ప్రతి పక్ష నాయకులను వెన్నతో పెట్టిన విద్య అని ఆరోపించారు. ఎన్టీఆర్‌ను, వారి కుటుంబాన్ని ఏ విధంగా వెన్నుపోటు పొడిచారో అదే విధంగా తన స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచేందుకు చంద్రబాబు ఓటు రాజకీయం చేస్తున్నారని మండి పడ్డారు. వలంటీర్లు వారి పరిధుల్లోని గృహాలకు వెళ్ళి జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలను క్షుణంగా వివరించాలన్నారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, గణపతిరెడ్డి, శివన్న, డ్రిప్ రమణ, సుబ్బరాం, శోభా, శంకర్, కుమార్‌రెడ్డి, కేవీ రమణ, తమక శంకర్, సుబ్బిరెడ్డి, కార్యం చంద్ర, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కువైట్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా అఫ్సర్‌అలీ



మదనపల్లె : వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కువైట్ కమిటీ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా మదనపల్లెకు చెందిన నశ్యంషేక్ అఫ్సర్ అలీ నియమితులయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌ఆర్‌ఐ విభాగం కువైట్ కమిటీని ప్రకటించారు. అందులో కువైట్‌లో 17 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటున్న మదనపల్లెకు చెందిన నశ్యంషేక్ అఫ్సర్‌అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అఫ్సర్‌అలీ మాట్లాడుతూ..పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే తప్పక గుర్తింపు లభిస్తుందనేందుకు తనకు దక్కిన పదవి నిదర్శనమన్నారు.

నీటి సంరక్షణ పనులకే ప్రాధాన్యత

పెద్దమండ్యం : ఉపాధి హామీ ద్వారా నీటి సంరక్షణ పనులకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు ములకలచెరువు క్లస్టర్ ఏపీడీ మధుబాబు అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో పనుల అమలుపై సమీక్షించారు. ఆయా గ్రామాల వారీగా కూలీల సంఖ్య, చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏపీడీ మాట్లాడుతూ రైతు పొలంలో భూసారం పెంపుదల, వర్షం నీటి సంరక్షణ కోసం నీటి నిల్వ కుంటలు, మట్టిగెనాలు, బావులలో పూడిక తీయుట పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే 5 ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు వందశాతం సబ్సిడీతో పండ్లతోటల పెంపకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రైతుల పొలంలో రైతులకు ఉపయోగపడే పనులు, గ్రామ అభివృద్ధికి తోడ్పడే పనులు ఉపాధి హామీ ద్వారా చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న వ్యక్తిగత పనులపై గ్రామాలలో రైతులకు, కూలీలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో మురళి, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కలికిరి: కలికిరి సమీపం నాలుగు లేన్ల హైవేవద్ద వద్ద విద్యుత్ లైన్ మార్పు కారణంగా మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ శ్రీనివాసులు తెలిపారు. హైవే వద్ద 220 కేవీ లైన్ కొత్త టవర్‌లు ఏర్పాటు కారణగా గురువారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు కలికిరి పరిధిలోని కొత్తపల్లి, సన్యాసివారిపల్లి, ఇందిరమ్మకాలని ఫీడర్‌లుచ నగిరిపల్లి, సీఆర్‌పీఎఫ్, పట్టణంలోని కలకడ రోడ్డు ప్రాంతాల్లో సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోండి



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



ఆరోగ్యశ్రీ కార్డు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

వాల్మీకిపురం : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తి పంచాయతీ చారావాండ్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మహ్మద్ వసీం, హర్షిత రెడ్డిలు ప్రజలకు వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రజలు ఈ వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాండురంగ, వైద్య సిబ్బంది సుధాకర, భానుబీ, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

తంబళ్లపల్లె : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంగళవారం కొటాల గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఆశాలత, తేజశ్వి, వంశీధర్‌రెడ్డిలు 420 మందికి వైద్యం చేసి మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్యశ్రీకార్డులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు వాసుదేవరెడ్డి, ఎంపీటీసీలు రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు

పెద్దమండ్యం : జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణయ్య అన్నారు. మండలంలోని కోటకాడపల్లె ప్రాథమిక పాఠశాల వద్ద మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపునకు వచ్చే ప్రజలు, రోగుల కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. క్యాంపునకు వచ్చిన ప్రజలకు, రోగులకు డాక్టర్‌ల బృందం చికిత్సలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌వో క్రిష్ణయ్య, డాక్టర్‌లు ఇమ్మాన్యుల్, హరివర్మ, గ్రామ సర్పంచ్ భుదేవి, ఎంపీటీసీ బోడెం రవితేజ, గ్రామ సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నెలవారీ నివేదికలు

ప్రభుత్వానికి సమర్పించాలి

డీఐఓ డాక్టర్.ఉషశ్రీ



మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ ఉషశ్రీ

మదనపల్లె : ప్రైవేట్ ఆస్పత్రుల, స్కాన్ కేంద్రాల వైద్యులు, ల్యాబ్స్, డయాగ్నస్టిక్ కేంద్రాల సిబ్బంది రోజువారీ, నెలవారీ నివేదికలు ప్రభుత్వానికి ఇవ్వాలని జిల్లా పీసీపీఎన్‌డీటీ నోడల్ అధికారి, డీఐఓ డాక్టర్.ఉషశ్రీ అన్నారు. మంగళవారం మదనపల్లె జిల్లా ఆస్పత్రిలోని డీఈఐసీ హాల్‌లో మదనపల్లె డివిజన్ పరిధిలోని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కాన్ సెంటర్స్ వైద్యులు, ల్యాబ్స్, డయాగ్నస్టిక్ సిబ్బందికి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన నివేదికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఐఓ డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుతూ.. ఏపీఏపీఎమ్‌సీఈ-2002 చట్టం, పీసీపీఎన్‌డీటీ చట్టం -1994 ప్రకారం ప్రైవేట్ ఆస్పత్రులు, స్కాన్ సెంటర్స్, ల్యాబ్స్, డయాగ్నస్టిక్ సెంటర్స్ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని నడపుకోవాలన్నారు. ఆస్పత్రిలో ఉండాల్సిన కనీససౌకర్యాలు తాగునీరు, రోగులు వేచి ఉండు గది, మరుగుదొడ్లు, వార్డులు, ఫైర్‌సేఫ్టీ, లిఫ్ట్, ర్యాంప్, పార్కింగ్‌ప్రదేశం తప్పక నిర్వహించాలని ఆదేశించారు. రోగులకు అందించే చికిత్సలకు బిల్లులు తప్పనిసరి అన్నారు. అలాగే చికిత్సలకు అందించే ధరలపట్టికను ఆస్పత్రి రెసెప్షన్ కౌంటర్‌లో ప్రజలకు కనపడేలా ఉంచాలన్నారు. డిప్యూటీ డెమో దేవశిరోమణి మాట్లాడుతూ..స్కాన్ సెంటర్స్‌లో గర్భస్థపిండ లింగ నిర్ధారణ చట్టం పోస్టర్స్, బ్యానర్లు కనపడేలా అతికించాలన్నారు.డీఎస్‌ఓ కరీముల్లా మాట్లాడుతూ...రోజువారీ ఆస్పత్రిలో ఓపీ వివరాఉల, ఐ.పీ. వివరాలు, కాన్పులు, అబార్షన్స్, సిజేరియన్ ప్రసవాలు, మాతాశిశుసంరక్షణ సేవలు, కుటుంబనియంత్రణ పద్ధతులు, ల్యాబ్‌టెస్ట్‌లు, జనన,మరణాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీ, జిల్లా అంటువ్యాధుల పర్యవేక్షకులు వెంకటేష్, మలేరియా నివారణాధికారి వేణుగోపాల్, ఎన్‌జీఓ నిర్వాహకురాలు లలిత, మహమ్మద్‌రఫీ, రాజగోపాల్, ఉష, సిబ్బంది అమర, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

22న డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

మదనపల్లె సిటీ : స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో ఈనెల 22న డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు శాఖ గ్రంథాలయాధికారి వసంతకుమారి తెలిపారు. కుట్టి డీఎస్సీ కోచింగ్ సెంటర్, చిత్తూరు ఆధ్వర్యంలో డీఎస్సీకి దరఖాస్తు చేసివారికి సేవాదృక్పథంతో మెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు. మెటీరియల్ కావాల్సిన వారు టెట్ మార్కుల జాబితాతో పాటు టెట్, డీఎస్సీ ఆన్‌లైన్ అప్లికేషన్ , రెండు ఫోటోలతో గ్రంథాలయం వద్దకు రావాలని కోరారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

ఆర్డీఓ హరిప్రసాద్



స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాట్లపై రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

మదనపల్లె : మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలో రానున్న సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీఓ హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్‌రూమ్, మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్, కౌంటర్స్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో, వేగవంతంగా స్ట్రాంగ్‌రూమ్ పనులు చేయాలన్నారు. రెండురోజుల క్రితం జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ జెడ్పీ హైస్కూల్‌లో స్ట్రాంగ్‌రూమ్, ఇతర ఏర్పాట్లపై పలుసూచనలు చేసి వెళ్లారని, వాటిని క్షేత్రస్థాయిలో ఎలా చేస్తున్నారో, పర్యవేక్షించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎలక్షన్ డీటీ అస్లాం, సర్వేయర్ సుబ్రహ్మణ్యం, పూర్ణ, ఆర్‌ఐ రెడ్డెప్ప, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌లో అపార అవకాశాలు



మాట్లాడుతున్న ఆనంద్ స్వరూప్

కురబలకోట : ప్రపంచ వ్యాప్తంగా అనేక సాఫ్ట్‌వేర్ కంపెనీలు క్లౌడ్ కంప్యూటింగ్ సేవలను విరివిగా వినియోగిస్తున్నందున ఇందులో అపార అవకాశాలు ఉన్నాయని చెన్నై ఆడమ్స్ బ్రిడ్జ్ గ్లోబల్ సీనియర్ మేనేజర్ డి. ఆనంద్ స్వరూప్ పేర్కొన్నారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో క్లౌడ్ కంప్యూటింగ్‌పై మూడు రోజుల పాటు హాండ్స్ ఆన్ ట్రైనింగ్‌ను నిర్వహించారు. మంగళవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆకర్షనీయమైన కెరీర్ ఆప్షన్లలో క్లౌడ్ కంప్యూటింగ్ ప్రముఖంగా నిలుస్తోందన్నారు. వ్యాపారాలు, ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచటంలో భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా టెక్నాలజీని తీసుకు రావడంలో ఇది కీలక పాత్ర వహిస్తోందన్నారు. అపరిమితమైన ఉద్యోగ అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. క్లౌడ్ కంప్యూటింగ్‌లో తక్కువ స్థలంలో ఎక్కువ సమాచారాన్ని సురక్షితంగా నిల్వచేయవచ్చన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సమాచార వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించవచ్చన్నారు.

కాళీయమర్ధిని అవతారంలో లక్ష్మీజనార్దనస్వామి



రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన అతి పురాతన లక్ష్మీజనార్దనస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారు కాళీయమర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ అర్చకులు పార్థసారధిబట్టర్, కులశేఖర్‌బట్టర్‌లు తీర్థప్రసాదాలు అందజేశారు.

జగనన్నతోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పీలేరు : వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న చింతల



కేవీపల్లె : మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : రాష్ట్రంలో జగనన్నతోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వీఎస్‌ఆర్ కల్యాణమండపంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ, గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా నాలుగు సార్లు దిగ్విజయంగా ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబు అబద్ధాల హామీలను ప్రజలు నమ్మి మోసపోరాదని తెలిపారు. త్వరలోనే జగనన్న ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేయబోతున్నారని, మరోసారి వరాల జల్లు కురిపించబోతున్నారని చెప్పారు. పీలేరులో ఇప్పటి వరకు 12 వేల ఇళ్లు ఇచ్చామని, పీలేరుకు వంద పడకల ఆస్పత్రి, పార్కు, అన్ని మతాలకు విడివిడిగా స్మశాన వాటికలు, ఆర్‌వోబీ నిర్మాణ పనులు చేపట్టిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఇదంతా కేవలం నాలుగు సంవత్సరాల కాలంలో చేపట్టామని తెలిపారు. మరోసారి అవకాశం ఇచ్చి ఎంపీగా మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తనను మరోసారి గెలిపించడంతోపాటు రెండో సారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, సర్పంచ్ జీనత్ షఫీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు హబీబ్‌బాషా, హుమయూన్, ఎన్.వి. చలపతి, మహితాఆనంద్, నాగరాజమ్మ, నీరజ, లక్ష్మీదేవి, స్టాంపుల నరసింహారెడ్డి, చంద్రారెడ్డి, బీసీ జయలక్ష్మీదేవి, ఆనంద్, ఉదయ్, మునీర్, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పని, మడమ తిప్పని వ్యక్తిత్వం ముఖ్యమంత్రిది

కేవీపల్లె : ప్రజలకు ఏదైనా హామీ ఇస్తే మాట తప్పని, మడమతిప్పని వ్యక్తిత్వం మన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిదని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ, గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి 95 శాతం అమలు చేశారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోయినా పథకాల క్యాలెండర్ ప్రకారం ప్రతి పథకానికి డబ్బులు జమ చేశారని తెలిపారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ మేరకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా డబ్బులు జమచేసినట్లు తెలిపారు. కేవీపల్లె మండలానికి రూ. 5.12 కోట్లు వైఎస్సార్ ఆసరా వచ్చినట్లు చెప్పారు. గ్రామ వలంటీర్ల వల్ల సమాజానికి ఎంత మేలు జరుగుతోందో గమనించాలని తెలిపారు. అనంతరం వైఎస్సార్ ఆసరా మెగా చెక్ పంపిణీ చేశారు. గ్రామ వలంటీర్లను సన్మానించారు. సమావేశంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ఏపీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ సుగుణమ్మ, నాయకులు పొత్తపు సతీష్‌రెడ్డి, జయరామచంద్రయ్య, సైఫుల్లాఖాన్, రాంప్రసాద్‌నాయుడు, రత్నాకర్‌రెడ్డి, రామకొండారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు.

మరో అవకాశం ఇవ్వండి

కలకడ : అందరి బంగారు భవిషత్‌కు, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగించడానికి ముఖ్యమంత్రికి మరో అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని కలకడ బాటవారిపల్లె ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ, వలంటీర్‌లకు వందనం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఎక్కడా అమలు చేయనన్ని అనేక సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. మహిళలకు ఆసరా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, కలికిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవికుమార్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, జెసిఎస్ జిల్లా కన్వీనర్ నరసింహారెడ్డి, మండలశాఖ కన్వీనర్ మోహన్‌రాజ్, మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయుడు, హరినాథరెడ్డి, షావత్‌అల్లీఖాన్, ఎంపీటీసీ సభ్యులు క్రిష్టారెడ్డి, రవికుమార్, మధుసూదన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఇనాయతుల్లా, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

